



ఎన్టీపీసీలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి

- 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- ఆర్థిక సంవత్సరంలో 11 రోజుల ముందే పూర్తి

7

అయోమయం.. ఆందోళన



కమాన్‌పూర్ మండలం పెంచికలపేటలో గ్రామసభ

- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాల్లో పేర్లు లేకపోవడంపై నిరాశ
- అయోమయంగా అర్హుల జాబితాలు
- ఏ గ్రామానికి, పట్టణానికి ఇళ్లు కేటాయిస్తారో తెలియని పరిస్థితి
- జిల్లాలో ప్రారంభమైన గ్రామ, వార్డు సభలు



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జాబితాలో తన పేరు ఉందని, ఇక ఇల్లు మంజూరు కావడం ఖాయమని సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వాలకట్ల భూమమ్మ భావోద్వేగంతో ఆనంద భాష్పాలు రాల్చగా..

ఇందిరమ్మ ఇంటి మంజూరు కోసం సర్వే పూర్తయినా అర్హుల జాబితాలో తన పేరు లేకపోవడంతో కమాన్ పూర్ మండలం గొల్లెన లావణ్య మాకు ఇల్లు మంజూరు కాదని అధికారుల కాళ్లు మొక్కింది... అధికారులు మంగళవారం నిర్వహించిన గ్రామసభలో చోటుచేసుకున్నాయి.



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు ఈ నెల 26వ తేదీ నుంచి శ్రీకారం చుడుతోంది. ఈ పథకాల కోసం ఇదివరకే ప్రజలు దరఖాస్తు చేసుకోగా, వాటిపై సర్వే నిర్వహించిన ప్రభుత్వం అర్హులైన జాబితాలను రూపొందించింది. ఆ జాబితాలను ప్రజల ముందు ఉంచేందుకు ఈనెల 21, 22, 23 తేదీల్లో గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం జిల్లాలోని 95 గ్రామాల్లో గ్రామసభలు, రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లోని 45 డివిజన్లు, వార్డుల్లో పట్టణ సభలను నిర్వహించారు. ఈ సభల్లో ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల జాబితాలపై పెద్దగా ప్రజల నుంచి అభ్యంతరాలు రాకపోగా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల జాబితాలపైనే చాలా గ్రామాల్లో అభ్యంతరాలను వెల్లడించారు.

నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ ఆర్థిక, ఉపాధి, విద్య, కులగణన సర్వేలో గుర్తించిన రేషన్ కార్డులు లేని కుటుంబాలు 15,255 ఉన్నట్లు గుర్తించారు. ఆ జాబితా లో ఉన్న వారి గురించి సర్వే చేశారు. గ్రామసభల్లో మాత్రం కొందరి పేర్లను మాత్రమే చదివారు. ఇది కులగణన సర్వే డేటానా, గతంలో మీ సేవా కేంద్రాల ద్వారా చేసుకున్న దరఖాస్తులా అనే విషయం తెలియడం లేదు. ఒకవేళ కులగణన సర్వేను పరిగణనలోకి తీసుకున్నా, అందులో రేషన్ కార్డు లేదని ఇచ్చిన వారి వివరాలు కూడా జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

రేషన్‌కార్డులపై నిరసన

ప్రజాపాలన సందర్భంగా రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోక పోవడంతో సదరు కుటుంబీకులు జాబితాల్లో తమ పేరు లేదని అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. భూములున్న వాళ్లు, సింగరేణి ఉద్యోగులు, వ్యాపారుల పేర్లు జాబితాల్లో వస్తే, కూలీ పనులు చేసుకునే తమ పేర్లు ఎందుకు రాలేదని పలువురు ప్రశ్నించారు. అలాంటి వారిని మరోసారి దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు వారికి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,80,664 మంది దరఖాస్తు చేసుకోగా, సర్వే అనంతరం ఇంటి స్థలం లేని వాళ్లు 48 వేల మంది, ఇంటి స్థలం ఉన్న వాళ్లు 58 వేల మంది పేర్లు అర్హుల జాబితాలో వచ్చాయి. మంగళవారం జరిగిన గ్రామ, పట్టణ వార్డు సభల్లో ఆ గ్రామాలు, వార్డులకు సంబంధించిన వార్డు సభల్లో పేర్లను అధికారులు చదివి వినిపించారు. అయితే చాలా మంది తాము అర్హులమే అయినప్పటికీ పేరు జాబితాలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు మరోసారి దరఖాస్తు పెట్టుకోవాలని సూచించడంతో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని

మిగతా 8వ పేజీలో

నేడు పెద్దపల్లిలో మందకృష్ణ సదస్సు

పెద్దపల్లిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. లక్ష డప్పులతో నిర్వహించే సన్నాహక సమావేశానికి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి డప్పులతో మాదిగలు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, నాయకులు, మహిళలు, ఉప కులాల ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రుద్రారం రాంచందర్, నాయకులు మం థని చందు, అంబాల రాజేందర్, మామిడిపల్లి బాపయ్య, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి అంబాల నరేష్, పులిపాక బానేశ్, కాదాసి చంద్రమౌళి, ఆదిత్య, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 8, 9వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎలిక్యూషన్, జస్ట్ ఎ మినిట్ పోటీలు నిర్వహించారు. 14 మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయి నుంచి ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు వంగ అశోక్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షయ, అక్షర, సాయి శివాని, విక్రాంత్, సాయి వర్షిత, జ్యోష్న, అక్షయ, నిషత్, మహీన్‌లకు షీల్డ్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మండల నోడల్ అధికారి చాట్ల ఆగయ్య, విజయరావు, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, రవిందర్, రాజ్‌కుమార్, నర్సయ్య, శేషాద్రి, ఇందిరా, అరుణ పాల్గొన్నారు.

రామగుండం రైల్వేస్టేషన్ సందర్శించిన ఎంపీ



రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

అంతర్గాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను మంగళవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా రూ.26 కోట్లతో చేపడుతున్న రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుని ఆదేశించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రైల్వే అధికారులకు సూచించారు. నాయకులు షేక్ ఇఫ్తేకార్‌అహ్మద్, అనుమాస శ్రీనివాస్, రాచకొండ కోటేశ్వర్లు, ఎండీ సాదిక్, సూర తార, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా



విద్యార్థులను సన్మానిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులందరికి అండగా ఉంటానని ధర్మపురి శాసన సభ్యుడు లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు టీ.మనోజ్ఞ, బి.సింధుప్రియ, బి.వైష్ణవి, ఓ.సౌజ్ఞ, ఏ.రంజిత్ కుమార్, బి.అశ్రితలు జాతీయ, రాష్ట్రస్థాయిలకు ఎంపిక కాగా వారిని సన్మానించారు. జాతీయ స్థాయి ఎంపికైన బి.వైష్ణవికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.10వేలను అందజేశారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ గురించి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ విప్ దృష్టికి తీసుకెళ్లగా ఏర్పాటు చేయిస్తానని సూచించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



స్టడీ కిట్లను అందజేస్తున్న జీఎం త్రిపాఠి

జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి చేస్తోందని రామగుండం ప్రాజెక్టు జీఎం(ఓఅండ్ఎం) అలోక్‌కుమార్‌త్రిపాఠి అన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఈడీసీ మిలీనియం హాల్‌లో ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక బాధ్యతగా సామాజికాభివృద్ధికి సీఎస్ఆర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఐదేళ్లుగా గర్ల్స్ ఎంపవర్‌మెంట్ మిషన్(జెమ్) పేరుతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 120 మంది 8వ తరగతి విద్యార్థినులకు నెల రోజులపాటు శిక్షణనిస్తున్నామన్నారు. గతేడాది జెమ్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులను ప్రోత్సహించేందుకు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. 50 మంది విద్యార్థినులకు జీఎం స్టడీకిట్లను అందజేశారు. జ్యోత్స్న త్రిపాఠి, రూపాసింఘరాయ్, మల్లిక, ప్రశాంత్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

సుల్తానాబాద్, జనవరి 21: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే దక్కుతాయని, ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలలో పైరవీలకు అవకాశం లేదన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తారని ఇది నిరంతరం ప్రక్రియ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం, మీసేవ, కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు గొల్లపల్లిలో రెండు కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తానని, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తానని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాశ్‌రావు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీడీవో దివ్యదిర్శన్‌రావు, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎనిమిది వార్డులలో గ్రామసభలు నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోగా పలు పథకాలకు సంబంధించి అర్హులైన వారి జాబితాను చదివి వినిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, కౌన్సిలర్లు, కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలోని కనుకుల,



గొల్లపల్లి గ్రామ పభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

గొల్లపల్లి, కాట్నపల్లి, రేగడిమద్దికుంట, కందునూరిపల్లి, రామునిపల్లి, నారాయణరావుపల్లి, గట్టెపల్లి, అల్లీపూర్, కదంబాపూర్,దుబ్బపేట్, నీరుకుళ్ల, మియాపూర్ గ్రామాలలో సభలు నిర్వహించారు.

జూలపల్లిలో...

జూలపల్లి: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసి ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. నాగులపల్లి, చీమలపేట, తెలుకుంట గ్రామాల్లో సభలు నిర్వహించారు. కలెక్టర్ కోయశ్రీహర్షతో కలిసి చీమలపేట గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు కడుపు మండుతుందని ఆయన మండిపడ్డారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోకుంటే గ్రామసభల్లో అందించాలన్నారు. అర్హులైన వారికి పింఛన్లు అందిస్తామని, రానున్న నాలుగు నెలల్లో వాటికి శ్రీకారం చుడుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పార్టీ కార్యకర్తలకు అందించారని, తమ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు అందించి తీరుతామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. చీమలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకోగా దానిని పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డి, ఏఓ ప్రత్యూష, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మెన్ గండు సంజీవ్, విండో చైర్మెన్ వేణుగోపాల్‌రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



చీమలపేటలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే

24 గంటల్లో సదరం సర్టిఫికెట్లు : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ 24 గంటల్లో పొందవచ్చని కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు క్యాంపునకు హాజరైన తరువాత జారీ చేసే సదరం సర్టిఫికెట్ గతంలో రోజుల తరబడి సమయం పట్టేదని, ఇక నుంచి కేవలం 24 గంటల వ్యవధిలో జారీచేస్తామన్నారు. ధ్రువపత్రాలను కలెక్టరేట్‌లోని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో పొందవచ్చని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

విక్రమ్ జీత్ దుగ్గల్‌కు ఐజీగా పదోన్నతి

కోల్‌సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌గా గతంలో పని చేసిన విక్రమ్ జీత్ దుగ్గల్‌కు ఐజీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి జీఓ ఆర్‌టీ నెం. 85ద్వారా ఆదేశాలు జారీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి దుగ్గల్ ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీస్‌లో పని చేస్తున్నారు.

వివేక్ దమ్ముంటే వర్గీకరణకు వ్యతిరేకంగా

పెద్దపల్లిలో చర్చ పెట్టాలి

విలేకరుల సమావేశంలో గోనె ప్రకాష్‌రావు, 'కాసిపేట'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోనె ప్రకాష్‌రావు

గోదావరిఖని, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వర్గీకరణను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు దమ్ము, ధైర్యం ఉంటే పెద్దపల్లిలో వర్గీకరణపై చర్చ పెట్టాలని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాష్‌రావు సవాల్ విసిరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీలలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రంలో 72వేల ఉద్యోగాలు మాలలకు వస్తే 18వేల ఉద్యోగాలు మాత్రమే మాదిగలకు వచ్చాయన్నారు. మందకృష్ణ మాదిగ 1996లో మాదిగ దండోరా ప్రారంభించి ఉద్యమం ప్రారంభించారని, 1999లో చంద్రబాబు ఆర్డినెన్స్ తీసుకువచ్చి వర్గీకరణను చేశారన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణ జరుపుకోవచ్చని ఆదేశాలు ఇచ్చిందని, దురదృష్టవశాత్తు గడువు విధించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేస్తామని ప్రకటించారని, తరువాత అతనిపై వర్గీకరణకు వ్యతిరేకంగా ఒత్తిడి తీసుకువస్తున్నా రన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ పార్టీని ధిక్కరిస్తూ బల ప్రదర్శన చేసి అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. వెంకటస్వామి కుటుంబానికి మొదటి నుంచి మాదిగలంటే పడదని, ఆయన ఎప్పుడూ మాదిగలను ఎదగనివ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని ఉపయోగించుకుని ఎనిమిది రాష్ట్రాల్లో 12పరిశ్రమలు పెట్టిన వివేక్ కుటుంబం పెద్దపల్లిలో ఎందుకు పరిశ్రమలు పెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 9శాతం జనాభా మాదిగ ఉపకులాలు ఉన్నారని, వారికి న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగల పోరాటం న్యాయమైందని, ఫిబ్రవరి 7న జరుగనున్న సభ తరువాత ఢిల్లీలో ఉద్యమం వస్తుందన్నారు. మాదిగల ఉద్యమానికి మద్దతు లభిస్తుందన్నారు.

స్వీయ రక్షణకు వాహనదారులు హెల్మెట్ వాడాలి

పాలకుర్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ ఆవరణలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత,ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు స్వీయరక్షణకు హెల్మెట్ ధరించాలన్నారు. ప్లాంట్ హెడ్ శ్రీనివాస రెడ్డి,సెక్యూరిటి ఇన్చార్జ్ రవీందర్ రెడ్డి,అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

- అందని బీమా పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- పట్టించుకోని స్త్రీనిధి అధికారులు

‘పశురక్ష’.. ఏదీ?

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు మృత్యువాత పడితే బీమా పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం పశురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో బీమా పరిహారం అందక పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలతో కొన్న పశువులు మృతి చెందడంతో పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్వశక్తి మహిళలకు డెయిరీ నిర్వహణలో భాగంగా పాడి పశువుల కొనుగోలుకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. పశువులు కొన్నప్పుడే బీమా చేయిస్తున్న అధికారులు అవి మృతి చెందితే పరిహారం అందించడం లేదు. ఇటు పరిహారం అందక, పశువులు మృతి చెందినా రుణం చెల్లించాల్సి వస్తుండడంతో వాటి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



● రూ. 92 వేల రుణం

స్త్రీనిధి ద్వారా మహిళలకు పాడి పశువుల కొనుగోలుకు 92,462 రూపాయల రుణం అందజేస్తున్నారు. ఇందులో నుంచి బీమాకు 827 రూపాయలు మినహాయించుకుంటున్నారు. ఈ రుణాన్ని మహిలలు 48 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలంలో మండలంలోని తాటిపల్లి, లంబాడిపల్లి, తక్కళ్లపల్లిలో పదికిపైగా పాడి పశువులు వివిధ కారణాలతో మృతి చెందాయి. బీమా కింద ఒక్కో దానికి 75 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాల్సి ఉంది. ఆ మొత్తం ఇంత వరకు లబ్ధిదారులకు అందలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● నిర్లక్ష్యమే కారణమా..

మూగజీవాలు మృతి చెందిన నెల రోజుల్లోగా బీమా పరిహారం కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మండలంలో మాత్రం నెల దాటిన తరువాతే క్లెయిమ్ పత్రాలు పంపించడంతోనే పరిహారం అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. తమకు పరిహారం అందక పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు

- మిట్టపల్లి సుశీల, తాటిపల్లి

బీమా పరిహారం చెల్లించకుండా అధికారులు లేనిపోని ఇబ్బందులు పెడుతున్నారు. జీవాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తగిన ఆధారాలు చూపినా పట్టించుకోవడం లేదు. అధికారుల చుట్టు తిరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

స్త్రీ నిధి అధికారులకు నివేదించాం

- జీసీ రాజయ్య, ఏపీఎం, ఐకేపీ

మృతి చెందిన పశువుల క్లెయిమ్‌లకు చెందిన పత్రాలను స్త్రీనిధి అధికారులకు పంపించాము. పశువుల మృతిపై అధికారుల అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంటుంది. క్లయిమ్ పత్రాలను పంపించడంలో జాప్యానికి మాకు సంబంధం ఉండదు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డు‘కట్ట’



నగునూర్ శివారులోని వాగు వద్ద తవ్విన కందకం

కరీంనగర్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ శివారులోని వాగులో ఇసుక అక్రమ రవాణాకు గ్రామ పంచాయతీ సిబ్బంది అడ్డుకట్ట వేశారు. మూడు రోజులుగా అర్ధరాత్రి సమయంలో కరీంనగర్ పట్టణానికి చెందిన ట్రాక్టర్లు వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాయి. అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతుండడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం వేకువజామున ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. వాగు రహదారి వెంట కందకాలు తవ్వారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినట్లయింది.

30న కోరుట్లలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ కార్మిక సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీన కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలు కొరకు బీడీ కార్మిక ప్రదర్శన క్షేత్రంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై ప్రవేశపెట్టిన జీఎస్‌టీని రద్దు చేసి కనీస పెన్షన్ రూ.5,000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడి కార్మిక సంఘ నాయకలు కొక్కుల శాంత, చెన్న విశ్వనాథం, మునుగురి హన్మంత్, ఎన్నం రాధ, మహేష్, ఎండి ముక్రం, ఎండి మౌలానా, ఎండి ఉస్మాన్, రామిల్ల రాంబాబు, సాయిఈశ్వరి, బాలే పద్మ, బేతి జ్యోతి, బొల్లె లక్ష్మిరాజం, కిరణ్, అందె వంశీ కృష్ణ, సమీర్ తదితరులు ఉన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మల్యాల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన భర్త నిత్యం డబ్బుల కోసం వేధిస్తూ దాడి చేయడంతో భార్యకు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మండలంలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన పొలవేని జయకృష్ణ తాగుడుకు బానిసై డబ్బుల కోసం భార్య నివేదితను నిత్యం వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి జయకృష్ణ తన భార్యను కొట్టడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉదయం పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మెట్‌పల్లి శివారులోని వట్టివాగు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్‌కుమార్ లారీ డ్రైవర్ షేక్ అజాం, లారీ యాజమాని ఎండి అజార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో జడపర్తరాములు వ్యవసాయ భూమిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కొడిమ్యాల ఎస్సై ఫోన్: 8712656831, మల్యాల సీఐ ఫోన్. 8712656818 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

స్కూటీలో మంటలు

మంథని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో ప్రమా దవశాత్తు స్కూటీలో మంటలు చెలరేగాయి. 8వ కాలనీకి చెందిన తగరం లింగయ్య, భార్య సమ్మక్కలు మంగళవారం స్కూటీపై మంథనికి వస్తుండగా కాయలు కాలిపోయి మంటలు వ్యాపించాయి. వారి వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారులు గమనించి అప్రమత్తం చేయడంతో వారు రోడ్డు పక్కకు నిలిపారు. మంటలను హెచ్‌పీ పెట్రోల్ పంప్ సిబ్బంది ఆర్పివేశారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

జగిత్యాలరూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ గ్రామానికి చెందిన ఈదుల రామయ్య(86) అనే వృద్ధుడు మంగళవారం ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మృతుడి సోదరుడు లింగయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిధిలో పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను గుర్తించి అప్పగించినట్లు టూటౌన్ సీఐ ప్రసాదరావు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వారి పిర్యాదులను స్వీకరించి, వాటిని గుర్తించి బాధితులకు అందజేసినట్టు సీఐ తెలిపారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టర్‌లో నమోదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు. ఫోన్లు ట్రాప్ చేసి బాధితులకు అప్పగించడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుల్ సాయిని సీఐ అభినందించారు.

పోలీసుల అదుపులో గంజాయి సేవిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో గంజాయి సేవిస్తున్న విద్యార్థులను మంగళవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలోని కొందరు విద్యార్థులు కలిసి పల్లె ప్రకృతి వనంలో గంజాయి తాగుతుండడాన్ని గమనించిన పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దాంతో ఐదుగురు విద్యార్థులు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయారు. మిగిలిన విద్యార్థులను అదుపులోని తీసుకుని ఠాణాకు తరలించారు. విచారణ జరుపుతున్నామని పోలీసులు వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవన్నారు.

చొప్పదండిలో పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి వద్ద విలపిస్తున్న రైతు కుటుంబం

చొప్పదండి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో మార్కెట్ రోడ్డులో ఒక ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రైతు బండారి బీరయ్య తన ఇంట్లో నిల్వ చేసిన 30క్వింటాళ్ల పత్తి దగ్ధం అయింది. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయగా దాదాపు రెండు లక్షల 50వేల విలువగల పత్తి కాలిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అగ్నికి ఆహూతికావడంతో రైతు కుటుంబం కంటతడి పెట్టింది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. తమని ఆదుకోవాలని రైతు అధికారులను కోరారు.

యువకుడి మృతి ఘటనలో నిందితుల అరెస్ట్

వేములవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున ఇద్దరు యువకులపై విచక్షణారహితంగా దాడి చేసి ఒకరి మృతికి కారణమైన సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఈనెల 15వ తేదీ వేకువజామున వేముల వాడ పట్టణానికి చెందిన కోగిల నాగేష్, గుగులోతు రాకేష్, ఎడవల్లి హర్షిక్, వంగల మంజునాథ్‌లు మద్యం మత్తులో ఏసుకూరి రాజేందర్, దుర్గం శంకరయ్య అనే వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేశారని, దాడిలో తీవ్రంగా గాయపడిన రాజేందర్ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 18న మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ సంఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. రాత్రి వేళల్లో జులాయిగా తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అమ్మ ఇంటికి రాలేదని

బాలుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి ఇంటికి రాలేదని కలత చెందిన ఓ ఎనిమిదేళ్ల బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాలో ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పారిశుధ్య కార్మికుడు సంతోష్-పూర్ణ దంపతులకు రిత్విక్, దీక్షిత్ ఇద్దరు కొడుకులు. ఈ నెల 20న సాయంత్రం అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని సంతోష్ మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాత్రి సంతోష్ దంపతులు ఆసుపత్రిలోనే ఉండిపోగా, మంగళవారం ఉదయమే సంతోష్ గ్రామానికి వెళ్లాడు. అనంతరం పంచాయతీ విధులు నిర్వహించేందుకు సంతోష్ వెళ్లిపోగా, ఆలస్యంగా నిద్రలేచిన పెద్ద కొడుకు రిత్విక్ తల్లిదండ్రులు రాలేదని భావించాడు. కలత చెంది చీరతో ఉరి వేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన చిన్న కొడుకు దీక్షిత్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రిత్విక్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

చొప్పదండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాయలంలో జాతీయ రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్ పడాల రాహుల్ హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి మాసంలో దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రమాదాలను నియంత్రించే బాధ్యత వాహనదారులపైనే ఉంటుందని అన్నారు. ఆర్‌టీఏ నియమ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐ హరిత, రిటైర్డ్ డీడీవో జైపాల్, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ● కలెక్టరేట్ వరకు పాదయాత్ర, ధర్నా



కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించడంతో పాటు ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్‌లకు నెలకు రూ. 18వేల వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు నాలుగు కిలోమీటర్లు పాదయాత్రగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర అరోగ్యశాఖ మంత్రితోపాటు కమిషనర్‌లకు వినతి పత్రం పంపించాలంటూ కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్‌లకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతలతో వారి సమస్యలను పరిష్కరించాలని అలాగే వారికి ఫిక్స్‌డ్ వేతనాలను అందించాలని 2023 సంవత్సరంలో సెప్టెంబర్ 25 వతేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయడం జరిగిందన్నారు. ఈ సమ్మెలో భాగంగా హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్‌లు చేపట్టిన ధర్నాలో అనాటి హెల్త్ కమిషనర్ శ్రీనివాస రావు రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆశావర్కర్‌ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఫిక్స్‌డ్ వేతనాలను అసెంబ్లీ సమావేశాలల్లో తీర్మాణించి నిర్ణయించాలని కోరారు. ఆశా కార్యకర్తలు సమస్యలపై ఎన్నో ఏళ్లగా పోరాడుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదావేణి మంజుల, జిల్లా గౌరవ అధ్యక్షురాలు భారతి, గాయత్రి, చంద్రకళ. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగకు మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లిలోని పెద్దమ్మగుడిలో చోరీకి పాల్పడిన కేసులో వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలోగల పెద్దమ్మగుడిలో చొరబడిన దొంగ మే 4, 2024న పుస్తెమట్టెలు ఎత్తుకెళ్లాడు. ఈ దొంగతనంపై ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామచంద్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శేఖర్‌రెడ్డి కేసు నమోదుచేసి దొంగతనం చేసిన శివరాత్రి సంపత్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఎస్ఐ గణేశ్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున పీపీ సందీప్ వాదించగా, కోర్టు మానిటరింగ్ అధికారి రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవెందర్‌లు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

ముత్తారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన కూరాకుల సాయికుమార్ (22) ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం దక్కలేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయికుమార్ మూడేళ్లుగా ఆర్మీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రయత్నం చేస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో ఉద్యోగాలు వచ్చినట్టే వచ్చి చేజారి పోతున్నాయని మనస్తాపం చెందేవాడు. ఈనెల 16న పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

డబ్బులు ఇప్పిస్తానని మోసం..

● వృద్ధ దంపతుల నుంచి రూ.3వేల వసూలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఓ వృద్ధ దంపతుల వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు రూ.3 వేలు వసూలు చేసి పారిపోయిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని అక్కపల్లికి చెందిన వృద్ధ దంపతులు అమృత-మల్లయ్యలు పనినిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న దంపతుల వద్దకు బైక్‌పై వచ్చి గుర్తు తెలియని వ్యక్తి, మహిళ ఆగారు. మీకు రూ.50 వేలు ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. మల్లయ్య వద్ద ఉన్న రూ.3.వేల నగదును వసూలు చేసి వెళ్లిపోయారు. జరిగిన విషయం చుట్టుపక్కల వారితో పాటు కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు మోసగించారని పేర్కొన్నారు. దాంతో వృద్ధ దంపతులు లబోదిబోమన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని వృద్ధ దంపతులు పేర్కొన్నారు.

రూ.80వేల నగదు, బైక్ అపహరణ

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఓ వైన్స్ షాపు వద్ద నిలిపిన బైక్‌తో పాటు ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.80 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని సయ్యద్ జావీద్ తన బైక్‌పై గొల్లపల్లి గ్రామ శివారులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లి వాహనాన్ని నిలపాడని పేర్కొన్నారు. అతడు తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు వాహనంతో పాటు ట్యాంకు కవర్లలో ఉన్న రూ.80వేల నగదును ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితుడు సయ్యద్ జావీద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

చున్నీ బైక్‌లో చిక్కుకుని

మహిళ మెడకు గాయాలు

గన్నేరువరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మెడలోని చున్నీ ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఇరుక్కొని మహిళ మెడకు తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి పర్శరాం తన కూతురు ప్రసన్నతో కలిసి మండలంలోని మాదాపూర్ నుంచి గన్నేరువరం ద్విచక్రవాహనంపై వస్తుండగా ఖాసింపేట మార్గమధ్యలో మెడలో ఉన్న చున్నీ వాహనం వెనక టైర్‌లో చిక్కుకొని చున్నీ మెడకు బిగుసుకుపోవడంతో ప్రసన్న కిందపడిపోయింది. దీంతో ప్రసన్న మెడకు తీవ్ర గాయం అయింది. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ సాయిప్రేమ్ మెడ చుట్టూ చుట్టుకున్న చున్నీని తొలగించి పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో బాధితురాలిని ఎక్కించుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుల్ సాయిప్రేమ్‌ను ఎస్ఐ తాండ్ర నరేష్, సీఐ కర్రె స్వామి అభినందించారు.

అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ అరెస్ట్

● రూ. 10లక్షల చిట్టి డబ్బులు ఎగవేతతో కేసు నమోదు

సైదాపూర్, జనవరి 21: అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన ఊసకోయిల వెంకటపతి అనే వ్యక్తి అక్షర చిట్‌ఫండ్‌లో రూ. 10లక్షల చిట్టి వేశాడు. చిట్టి గడువు తీరినప్పటికీ అక్షర చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు చిట్టి డబ్బులు ఇవ్వడం లేదు. దాంతో వెంకటపతి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని శ్రీనివాసరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. చిట్‌ఫండ్ యజమానులు గడువు తీరిన చిట్టీల డబ్బులు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం

నిందితుడికి మూడు సంవత్సరాల జైలు

భీమారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తికి కోర్టు మంగళవారం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మండలంలోని రాగోజీపేట గ్రామానికి చెందిన రాపెల్లి నగేష్‌కు నిజామాబాద్ జిల్లా పిప్పరి మండలం భీంగల్ గ్రామానికి చెందిన ఎగోలం మనోజ్ కుమార్‌తో దుబాయ్‌లో పరిచయం ఏర్పడింది. మనోజ్ దగ్గర దుబాయ్‌కు చెందిన అలికో కంపెనీ వీసాలు ఉన్నాయని నమ్మించి రాపెల్లి నగేష్‌తో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురి వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు తీసుకుని నకిలీ వీసాలు ఇచ్చాడు. తమకు ఇచ్చిన వీసాలు నకిలీవని తెలుసుకున్న నగేష్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడు మనోజ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా కేసు విచారణలో భాగంగా కోరుట్ల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పావని నిందితుడు మనోజ్ కుమార్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసు దర్యాప్తులో నిందితుడిని శిక్ష పడేలా చేసిన ఏపీపీ ప్రణయ్ కుమార్, ఎస్సైలు శ్యామ్‌రాజ్, వెంకటేశ్వర్ రావు, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మహేశ్వర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి

ఎల్లారెడ్డిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 20న బడికి వెళ్లి వస్తున్న ఎనిమిదేళ్ల బాలికను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని నిందితుడికి దేహశుద్ధి చేశారని తెలిసింది.



సంగీత కచేరి నిర్వహిస్తున్న అనుపమ



కళాకారిణి ప్రదర్శన

కొనసాగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాద బ్రహ్మ, లయ బ్రహ్మ సద్గురు శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కొనసా గుతున్నాయి. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్య క్రమాన్ని నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు శ్రీత్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఉద యం 10 గంటలకు శిఖామణి హరికథను, ఉదయం 11.30 గంటలకు రాఘవేంద్ర తబలా సోలో కార్యక్రమాన్ని చేపట్టగా, సాయంత్రం 4.30 గంటలకు అనుపమ చేసిన సంగీత కచేరి ఆకట్టుకుంది.





తబలా వాయిస్తున్న కళాకారులు

చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ..

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీబద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు శ్రీబద్ది పోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం తెల్లవారు జామునుంచే దర్శనానికి తరలివచ్చారు. మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి తరలివచ్చారు. పిల్లాపాపలు, పాడిపంటలను చల్లంగా చూడాలని అమ్మవారికి పట్నం వేసి, ఒడి బియ్యం పోసి నైవేద్యాన్ని సమర్పించారు. కళ్లసాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు క్యూలైన్లు త్వరగా కదిలేలా చర్యలు చేపట్టారు.



రద్దీగా మారిన బద్ది పోచమ్మ ఆలయం



● **అంజన్న సన్నిధిలో భక్తుల సందడి**

మల్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయం వద్ద భక్తులు

● అంజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యన్నదానం కోసం హైదరాబాద్ బాలనగర్‌కు చెందిన వై.దినేశ్‌రెడ్డి అనే భక్తుడు రూ.75వేలు అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్‌కు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీలో రికార్డు స్థాయిలో ఉత్పత్తి

● 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి

● ఆర్థిక సంవత్సరంలో 11 రోజుల ముందే పూర్తి



జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ వేగంగా 350 బిలియన్ యూనిట్ల(బియు) విద్యుత్ ఉత్పత్తి మైలు రాయిని దాటింది. ఈ మేరకు ఎన్టీపీసీ అధికార వర్గాలు మంగళ వారం ప్రకటన విడుదల చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈనెల 20వ తేదీ నాటికి గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ రోజుల్లో 350 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జనవరి 31 నాటికి 350 బిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరుగగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 రోజులకు ముందే కేవలం 295 రోజుల్లోనే మైలురాయిని దాటడం విశేషం. దేశవ్యాప్తంగా థర్మల్, గ్యాస్, సోలార్, విండ్, జల విద్యుత్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ఎన్టీపీసీ 76.5 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగి ఉంది. దేశానికి నాల్గవ వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ అందిస్తోంది. రాష్ట్రంలో ఎన్టీపీసీకి చెందిన రామగుండంలో 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుతోపాటు 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ), 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 10 మెగావాట్ల సర్ఫేస్ సౌర విద్యుత్ ప్రాజెక్టులు పని చేస్తున్నాయి.

తలనీలాల టెండర్‌కు ముందుకు రాని కాంట్రాక్టర్లు..

● వాయిదా వేసిన రాజన్న ఆలయ అధికారులు

వేములవాడ కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రెండు సంవత్సరాలకు తలనీలాలు సేకరించుకునేందుకు మంగళవారం నిర్వహించిన టెండర్‌కు ఆదరణ కరువైంది. మంగళవారం 2025-27 సంవత్సరానికి టెండర్లను ఆహ్వాని ంచారు. గత రెండేళ్లకు గాను ఇప్పటికే టెండర్లు దక్కించుకున్న కాంట్రా క్టర్ ప్రస్తుత పరిస్థితులలో ధర ఎక్కువైందని చెప్పి స్వామివారికి నగదును చెల్లించకుండా మొండికేశాడు. అయితే ఈ ఏడాది మార్చి మాసం నాటికి సదరు కాంట్రాక్టర్ గడువు ముగుస్తుండగా, మూడు మాసాల ముందే రాజన్న ఆలయంలో తలనీలాలను సేకరించుకు నేందుకు టెండర్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం టెండర్‌ను నిర్వహిస్తున్నామని రాజన్న ఆలయ అధికారులు పత్రికా ప్రకటన చేసినప్పటికీ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఆన్‌లైన్‌లో కూడా టెండర్లు ఎవరు దాఖలు చేయకపోవడంతో రాజన్న ఆలయ అధికా రులు టెండర్‌ను వాయిదా వేశారు. అయితే మరోసారి నిర్వహిస్తామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

ఎస్సారార్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్

గణేశ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్, అటానమస్ కళాశాల యూజీ మూడో, ఐదో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ కళాశా లలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బీఎస్సీ హానర్స్, బీసీఏ, బీబీఏ కోర్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడో సెమిస్టర్ లో 1215 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 646 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఐదో సెమిస్టర్‌లో 1197మంది విద్యార్థులకు 768 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. ఠీఠీఠీ.ఽఽఽ.ఛిజి.ఛౌఽలో ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీలో నీరుండగానే పూడికతీత

● ఈ నెలాఖరు వరకు టెండర్లు ఖరారు

● కొత్త ప్రయోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దిగువ మానేరు జలాశయం (ఎల్‌ఎండీ) నిండా నీరు ఉండగానే కొత్త పద్ధతిలో పూడికతీత పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మ కంగా ఎల్‌ఎండీ, మిడ్ మానేర్‌తోపాటు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులో ఈ కొత్తపద్ధతిలో పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని స్థాపిత లక్ష్యానికి చేర్చాలని ప్రభు త్వం భావిస్తున్నది. వర్షాలు, వరదల కారణంగా ప్రాజె క్టుల్లోకి పూడిక వచ్చి చేరుతున్నది. యేటా వచ్చే ఈ పూడికతో నీటినిల్వ సామర్థ్యం క్రమేపి తగ్గిపోతున్నది.

● **పూడికతో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం**

ఎల్‌ఎండీని 24.034 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1985లో నిర్మించారు. డెడ్ స్టోరేజి లెవల్ 2.09 టీఎంసీలు కాగా, రిజర్వాయర్‌లో పూడిక పేరుక పోవడంతో కేవలం 1.9 టీఎంసీలు మాత్రమే డెడ్ స్టోరేజీలో ఉంటు న్నాయి. పూర్తి నీటి నిల్వ సామ ర్థ్యాన్ని పెంచేం దుకుగాను పూడిక తీత ఏకైక మార్గమని గుర్తించిన ప్రభుత్వం అందుకు సిద్ధ మైంది. కొన్ని సంవత్సరాలుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడం, రిజర్వాయర్ల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోస్తుండడంతో ఎల్‌ఎండీ, మిడ్ మానేరు తదితర రిజర్వాయర్లు నిండుకుండలా ఉంటున్నాయి. నీరుం డగానే పూడిక తీత చేపట్టేందుకు కొత్త పద్ధతిలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మ కంగా ఎల్‌ఎండీ, మిడ్‌మానేరు, కడెం ప్రాజెక్టుల్లో కొత్త పద్ధతిలో పనులు చేప ట్టేందుకు కాంట్రాక్టును ఖరారు చేసేందుకు టెండర్లు పిలిచారు. ఈనెల 21తో గడువు ముగిసింది. 27న టెక్నికల్ బిడ్ టెండర్లు తెరవనున్నారు. అనం తరం 30న ఫైనాన్సియల్ బిడ్ తెరచి కాంట్రాక్టును ఖరారు చేస్తారు. ఈ కాంట్రాక్టు 20 ఏళ్ల పాటు కొన సాగుతూ ఆయా ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సి ఉంటుంది. మూడు ప్రాజెక్టుల్లో కలిపి 4.26 కోట్ల టన్నుల పూడిక తీయనున్నట్లు చెబుతున్నారు. పూడికలో 25శాతం ఇసుక వచ్చే అవకాశం ఉన్నది. ఈ ఇసుకను టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి కాంట్రాక్టర్ వాటిని మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. దిగువ మానేరులో 131 లక్షల టన్నులు, మధ్య మానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయాలని నిర్ణయించారు. . మూడు ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులకు 1439.55 కోట్ల రూపాయల అంచనాతో కరీంనగర్ ఇరిగేషన్ ఎస్‌ఈ టెండర్లు పిలిచారు. దీనికి కరీంనగర్ ఇరిగేషన్ ఇఎన్‌సీ మోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తపద్ధతిలో పూడిక తీత విజయవంతమైతే ఇతర రిజర్వాయర్లలో కూడా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది.



సిరిసిల్ల నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

● మహిళశక్తి చీరల కోసం 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లు

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నల సంక్షే మానికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టు బడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం స్వశక్తి సంఘాలకు అందించే యూని ఫాం చీరల ఆర్డర్లు ఇచ్చి పెద్దఎత్తున పని కల్పించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో ఒక ప్రకటన జారీ చేశారు. స్వయం సహాయక సంఘాలకు అందించే ఇందిర మహిళ శక్తి పథకంలో భాగంగా అందరికి ఒకే రంగు గల ఒక్కొక్కరికి ఒక్కో చీర అందజేసేందుకు 4.24 కోట్ల మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు అందజే సినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీలోపు ఈ చీరలు సిద్ధం కానున్నా యని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రభు త్వం సిరిసిల్లకు రూ.50 కోట్లతో యా రన్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూల్ యూనిఫాంల కోసం మ్యాక్స్ సొసైటీలకు 65.67 లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్నా రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేశా మని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికుల సమస్యలను విస్మరించిందని, బకాయిలు కూడా చెల్లించకుండా నేత కార్మికులను ఇబ్బందులకు గురిచే సిందని తెలిపారు. తమ ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖా న్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి మైథిలి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీ లకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యా యుడు మామిడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలో ఇటీవల జరిగిన పోటీల్లో మైథిలి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మైథిలిని ప్రిన్సి పాల్ గంగాధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్స శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.



మైథిలి

హైవోల్టేజీ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయెద్దు

రాయికల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు గ్రామం నుంచి రాయికల్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయెద్దని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామం మధ్యలో నుంచి హైవోల్టేజీ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ప్రమాదాలు ఏర్పడుతాయని రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సై సుధీర్ రావు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ ఏఈ నవీన్‌తో మాట్లాడారు. 11 కేవీ విద్యుత్ వైర్లకు దూరంగానే 33 కేవీ తీగలు ఏర్పాటు చేస్తున్నామని మహిళలకు నచ్చజెప్పడంతో నిరసన విరమింపజేశారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

ఎన్‌వైకే ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగహన

గణేశ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువతకు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించాలన్నారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ మంది యువకులు గాయాలబారిన పడుతున్నారని తెలిపారు. యువత ట్రా ఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని వ్యాహనాన్ని జాగ్రత్తగా నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, కారులో వెళ్తే తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ఫోన్ మాట్లా డుతూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు న్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ బ్లూటూత్ పెట్టుకుని పాటలు వింటూ వాహనాలను నడిపితే ఏకా గ్రత దెబ్బతిని ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్ర మంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం వెంకట్ రాంబాబు, ప్రోగ్రామ్ అధికారి బసవపత్రి ర వీందర్, పబ్లిక్‌రిలేషన్‌అధికారి మలహర్‌రావు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌వైకే సభ్యులు

అక్షరాలే ఉపాధి

● పుట్టుకతోనే దివ్యాంగుడు

● ఉపాధిహామీ బోర్డులు, గడపలకు డిజైన్లు వేస్తూ బతుకుదెరువు




ఉపాధిహామీ బోర్డులపై అక్షరాలు రాస్తున్న రాజయ్య

పెద్దపల్లి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన బొంకూరి రాజయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. కుడి చేయి కాలు, చేయి పని చేయకపోయిన ఒంటి చేత్తో బతుకు బండి లాగిస్తున్నాడు. అక్షరాలనే నమ్ముకొని కుటుంబాన్ని పోషి స్తున్నాడు. రాజయ్య డిగ్రీ వరకు చదువుకొని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. కొన్ని రోజులు ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. కుటుంబానికి సరిపడ ఆర్థిక పరిస్థితులు లేకపోవడంతో 15 ఏళ్ల క్రితం ఎడమ చేతితో గడపలపై రంగులతో ముగ్గులు వేయడం ప్రారంభిం చాడు. అనంతరం పలువురి సలహాతో ఈజీఎస్‌కు సంబంధించిన పనులు, నిధుల వివరాలను సూచించే బోర్డులు రాస్తూ ఉపాధి పొందుతున్నాడు. పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నేమ్ బోర్డులు రాస్తున్నాడు. భార్య కూలీ చేస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది.

ఉపాధి కల్పించండి

- బొంకూరి రాజయ్య, గౌరెడ్డిపేట, ఆర్టిస్ట్

ఆర్థిక పరిస్థితుల వల్ల కుటుంబంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రస్తుతం ఆర్టిస్ట్‌గా జీవనాన్ని సాగిస్తూ కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. ప్రభుత్వం ద్వారా అందే పింఛన్ డబ్బులు, ఆర్ట్ ద్వారా వచ్చే డబ్బు లతో కుటుంబాన్ని వెళ్ళదీస్తున్నా. ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలి.



పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక




మంథనిలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అప్పన్నపేట సభలో పాల్గొన్న ఆర్డీవో గంగయ్య

మంథని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను పారదర్శంగా ఎంపిక చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన వార్డు సభకు కలెక్టర్ మంగళవారం హాజరైన మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. ప్రకటించిన జాబితాలో పేర్లు లేనివారు వార్డు, గ్రామ సభల్లో తిరిగి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఎవరికైన సొంత ఇల్లు ఉంటే సమాచారం అందిస్తే విచారణ జరిపి పేర్లు తొలగిస్తామన్నారు. రేషన్‌కార్డులు అందించేందుకు జాబితా సిద్ధం చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. వితంతులు, దివ్యాంగులు, అత్యంత నిరుపేదల ప్రాధాన్యతగా జాబితా సిద్ధం చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామన్నారు. ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ రమ-సురేష్ రెడ్డి, కమిషనర్ మనోహర్, వైస్ చైర్మ న్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు వీకే. రవి, లక్ష్మి పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించారు. అక్కెపల్లి, పుట్టపాక, నగరంపల్లి, సూరయ్యపల్లి, కాకర్లపల్లి, గోపాల్‌పూర్, చిన్నఓదాల, నాగారం, పోతారం, ఉప్పట్ల, మల్లారం, ఆరెంద గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కాకర్లపల్లి గ్రామ సభకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, ఆర్డీవో సురేష్, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజయ్యలు పాల్గొన్నారు. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. ఆత్మీయ భరోసాకు 405, ఇందిరమ్మ ఇండ్లకు 495, రేషన్‌కార్డులకు 498, రైతు భరో సాలకు 28 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చర్యలు చేపడుతామని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. అప్పన్నపేటలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ అధికారులు ఎంపిక చేసిన జాబితాను ప్రకటించారు. ఆర్డీవో మాట్లాడుతూ దరఖాస్తులు పరిశీలించి రేషన్ కార్డులు అందించేందుకు జాబితా సిద్ధం చేశామన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి శ్రీలత సిబ్బంది పాల్గొన్నారు.

బొంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామంలో ఎంపిక చేసిన జాబితాను అధికారులు ప్రకటిస్తుండగా పేర్లు రాని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాల భూములు ఉన్నవారి పేర్లు జాబితాలో వచ్చాయని, భూములు లేనివారి పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కమాన్‌పూర్,(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. నాగారం, సిద్దిపల్లె, పెంచికల్‌పేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నాగారం, పెంచికల్‌పేట గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు ఎంపిక జాబితాలో పేర్లు లేకపోవడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. పెంచికల్‌పేట గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని లావణ్య అనే మహిళ ఎంపీడీవో లలిత కాళ్ళు మొక్కారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రానివారు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతామన్నారు. తహసీల్దార్ వాసంతి, ఎంపీడీవో జి.లలిత, ఎస్సై ప్రసాద్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఎంపీడీవో కాట భాస్కర్, ఆర్ఐ స్రవంతి, పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): ఎల్కలపల్లి, గుడిపెల్లి, గుంటూరుపల్లి, కొత్తపల్లె, మారేడుపల్లి, రామరావుపల్లె, ఉండెడ, వేమునూర్, ఎఫ్‌సీఐ గేట్ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. ఎల్కలపల్లిలో ఎంపీడీవో అల్లం పూర్ణచందర్‌రావు, కొత్తపల్లెలో తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు. అర్హుల జాబితాను చదివి వినిపించారు. జాబితాలో పేర్లు రాని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా సహకార సంఘ అధికారి శ్రీమాల అన్నారు. ఆరెపల్లి, తారుపల్లి, పెగడపల్లి, పందిళ్ల, ఆశన్నపల్లి, కిష్టంపేట, ఇదిలాపూర్, కూనారం గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. లబ్ధిదారుల పేర్లను సభల్లో చదివారు. ఇరిగేషన్ డీఈ రవి, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో రామ్మోహనచారి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, ఎస్సైవెంకటేష్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ బషీరోద్దీన్‌లు అన్నారు. లాలపల్లి, లోకేపేట, నారాయణపల్లి, బుకహన్‌మియాపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సభలో ఎంపిక జాబితాను చదివి వినిపించారు. పేర్లు రాకుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లోకపేట గ్రామసభలో పలువురు మహిళలు పేర్లు రాలేదని ఆరోపించారు. లాలపల్లిలో 30మంది రైతులకు బోనస్ డబ్బులు పడలేదని రైతులు వాపోయారు. మండల స్పెషల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏవో ఉమాపతి, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, ఈజీఎస్‌టీ ఎ.రంజిత్, ఆర్ఐ జయలక్ష్మి, ఏఎస్సై చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): కాలనీలోని 16, 17 డివిజన్‌లలో వార్డు సభలు జరిగాయి. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళకు దరఖాస్తులు చేసుకున్న వారి జాబితాను అధికారులు తెలియజేశారు. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్వే సమయంలో తాము ఇళ్ళలో లేమని, జాబితాలో తమ పేర్లు రాలేదని పలువురు పేర్కొన్నారు. వార్డు ఆఫీసర్లు అంజలి, సంతోష్‌కుమార్, ఆర్వో ఆంజనేయులు, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రజిత, కార్పొరేటర్లు మండల కిషన్‌రెడ్డి, శంకర్, పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): రత్నాపూర్, పన్నూరు, బుధవారంపేట్, రాజాపూర్, సుందిల్లా, జల్లారం గ్రామాల్లో గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. మండల స్పెషల్ ఆఫీసర్‌గా డిసిఎస్‌వో రాజేందర్, ఎంపిడివో శైలజారాణి, ఎంపివో ఉమేష్‌లు పాల్గొన్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు రాలేందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు కాకుండా సంపన్నుల పేర్లే ఎక్కువగా ఉన్నాయంటూ అధికారులను ప్రశ్నించారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డుల జారీకి అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్లు దాసరి వేణు, అరుణశ్రీ, మేయర్ అనీల్‌కుమార్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలక సంస్థ 31వ డివిజన్ శివాజీనగర్‌లో జరిగిన గ్రామ సభలో వారు మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. ఆహార భద్రత కార్డులకు సంబంధించి 3971దరఖాస్తులు రాగా 2701 కుటుంబాలు కొత్తగా ఆహార భద్రత కార్డుల జారీకి అర్హులయ్యారన్నారు. మరో 9704మంది రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చడం, సవరణల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిని కూడా పరిశీలిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు అడ్డాల రామస్వామి, మహంకాళి స్వామి, కల్వల శిరీష సంజీవ్, ముస్తాఫా, తహసీల్దార్ కుమారస్వామి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఈఈ రామన్, డీఈజమీల్‌పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వార్డు సభలో ఫోటోల వివాదం చోటు చేసుకున్నది. 31వ డివిజన్ శివాజీనగర్‌లో జరిగిన వార్డు సభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మంత్రి శ్రీధర్‌బాబుల ఫోటోలు పెట్టలేదని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఫ్లెక్సీలను పెట్టామన్నారు. బుధవారం జరుగనున్న సభలో మంత్రి, ఎమ్మెల్యే ఫోటోలు ఉండేలా చూస్తామని పేర్కొన్నారు.

ధర్మారం (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్ భరోసా ఇచ్చారు. నందిమేడారంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు 674 మంది దరఖాస్తు చేసుకోగా 171 మందిని ఎంపిక చేశారని తెలిపారు. జాబితాలో పేరులేని వారు నిరుత్సాహపడవద్దని, దరఖాస్తుదారులందరికీ ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేడారంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని చెప్పారు.





గ్రామ సభలో మట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గ్రామ సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణ శ్రీ

నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక

రామ్మోహనచారి, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి: ఆత్మీయభరోసా లబ్ధిదారులను ఎలా గుర్తించారు?

ఎంపీడీవో: ప్రభుత్వం అమలుచేసే నాలుగు సంక్షేమ పథకాలలో ఆత్మీయ భరోసా పథకం ఒకటి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈజీఎస్ కార్డుపై 20రోజులు పనిచేసి భూమిలేని వ్యవసాయ వారికి రూ.12,000 ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఆంధ్రజ్యోతి: కొత్తరేషన్‌కార్డు దారులు ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ఎంపీడీవో: కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయని వారు గ్రామసభలో దరఖాస్తు ఇవ్వవలసి ఉంటుంది. గ్రామ సభలో కాకుండా కార్యాలయంలో ఇచ్చినా దరఖాస్తు చేసుకుంటే అర్హులను పరిశీలిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఇల్లులేని వారిని ఎలా గుర్తించారు?

ఎంపీడీవో: ఇటీవల మండలంలో సర్వేచేసి ఇల్లులేక భూమి ఉన్న వారి ఒక జాబితా, భూమిలేని వారి మరో జాబితా తయారు చేశాం. ఇల్లులేని వారికి గ్రామసభలో పేరు రాకుంటే దరఖాస్తు చేసుకోవాలి. మండల కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- కాల్వశ్రీరాంపూర్

అటవీ సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

అంతర్గాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారు అటవీ ప్రాంతంను మంగళవారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీకి చెందిన విశ్వభారతి విద్యార్థులు సందర్శించారు. సారేధార్ ఎండీ రహ్మతుల్లా అటవీలో చెక్ డ్యాం, సాసర్ పీట్ల ఏర్పాటు వలన జంతువులు, పక్షులకు కలిగే లాభాలను వివరించారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే తీసుకోవలసిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సీహెచ్ నాగయ్య, సారెదార్ ఎండీ రహ్మతుల్ల, బీట్ ఆఫీసర్ ఇర్షద్ బేగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోమయం..ఆందోళన

5వ పేజీ తరువాయి

కొందరు అసహనానికి గురయ్యారు. తమ పేరు ఎందుకు లేదని సభల్లో అధికారులను ప్రశ్నించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల మంజూరుపైనే ఆశలు పెంచుకున్నారు. జాబితాల్లో పేర్లు ఉన్న వాళ్ల ఈ విడతలో కాకపోయినా మరోవిడతలో ఇల్లు మంజూరు అవు తుందనే భరోసాతో ఉండగా, పేర్లు లేని వాళ్ల మాత్రం ఆందోళనకు గురవుతున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేవని చెబుతున్న లావణ్య, స్వరూప

ఒక్కో నియోజకవర్గానికి మొదటి విడతలో ప్రభుత్వం 3500 ఇళ్లు కేటాయించగా, ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయిస్తారనే విషయం ఎవరికి తెలియకుండా ఉన్నది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం 1923, రేషన్ కార్డుల కోసం 3075 దరఖాస్తులు వచ్చాయి. పోలీస్ బందోబస్తు మధ్య గ్రామ, వార్డు సభలు జరిగాయి.

ఫ్లెక్సీపై ఫొటోల లొల్లి

గ్రామసభల్లో పెట్టిన ఫ్లెక్సీల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలు లేకపోగా, కొన్ని చోట్ల ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫొటో పెట్టకపోవడంపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫొటోలు పెడతామని ఇన్‌చార్జీ కమిషనర్ హామీ ఇచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు నియోజవర్గంలోని చీమలపేట, గొల్లపల్లి, తదితర గ్రామాల్లో గ్రామసభలకు హాజర య్యారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష చీమలపేట, మంథని మున్సిపాలిటీ సభకు హాజరయ్యారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పీటీఎస్‌లోని సెయింట్ క్లేర్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం షీ టీం, యాంటీ డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. గోదావరిఖని షీటీం ఇన్‌చార్జి ఎఎస్ఐ మల్లయ్య మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పోలీసు శాఖ షీ టీంలను ఏర్పాటు చేసిందన్నారు. వేధింపులకు గురి చేస్తే నిర్భయంగా 6303923700 నెంబరుకు ఫోన్ చేయాలని, ఫోన్ చేసిన వారి సమాచారాన్నిగోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే అత్యాశకు లోనై సైబర్, ఆన్‌లైన్ మోసాలకు గురవుతున్నారని, ఇలాంటి మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసానికి గురైన వారు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సెయింట్ క్లేర్ పాఠశాల హెచ్‌ఎం ఫాదర్ డోమినిక్, షీ టీం సభ్యురాలు, పీసీలు స్నేహలత, సురేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మంథని, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మంథని ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.95 లక్షలు మంజూరు చేయడంతో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బస్టాండ్ భవనాన్ని, ప్లాట్‌ఫాంలు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సంఖ్యను పెంచడానికి, లైటింగ్, ఫ్యాన్స్, బెంచీలు, గ్రీనరీ కోసం మినీ పార్కు, పార్కింగ్ ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పీఏపీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, గోటికార్ కిషన్, శ్రీపతి బానయ్య, కుడుదుల వెంకన్న, రవి, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జ్యోతినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ హామీ ఇచ్చారు. మంగళవారం ఎన్టీపీసీ వీజీపీ గెస్ట్‌హౌజ్‌లో ఎన్టీపీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఎంపీ వంశీకి వినతిపత్రం అందజేశారు. ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ 2018లో జరిగిన ఒప్పందం ప్రకారం సీనియర్ కార్మికులు, ఐటీఐ పూర్తి చేసిన కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుల పిల్లలకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పోలీసు వెరిఫికేషన్, మెడికల్ టెస్టుల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దని, మెడికల్ టెస్టులతో సంబంధం లేకుండా గతంలో మాదిరిగా ఏడాది వరకు పని చేసే గేట్ పాసులు ఇవ్వాలని ఎంపీ సూచించారు. కార్మికులందరికీ సబ్సిడీతో కూడిన క్యాంటీన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఎన్టీపీసీ జీఎం ఎ.కె.త్రిపాఠి, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్‌తో చర్చించారు. గత ఒప్పందాన్ని అమలు చేయడంతోపాటు ఇతర డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చాలని కోరారు. ఐఎన్‌టీయుసీ జాతీయ నాయకుడు బాబర్ సలీం పాషా, జేఏసీ నాయకులు శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, సత్యం, శ్రీనివాస్ ఉన్నారు.

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తాం...

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. రామగుండంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అంబేద్కర్ భవనం నిర్మించాలని, సెంట్రల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని, గోదావరిఖనిలో ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం, స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు సీనియర్ సిటీజన్లు కూర్చునేందుకు బెంచిలు ఏర్పాటు చేయాలని, టాయ్‌లెట్స్ లేకవాకర్స్ ఇబ్బంది పడుతున్నారని, టాయ్‌లెట్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పలువురు ఎంపీకి విన్నవించారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ఓదెల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మంగళవారం హిందూవాహిని ఆధ్వర్యంలో కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. హిందూవాహిని కార్యకర్తలు శాతాళ్ల కుమార్, మేర్గు సారంగం, మేకల రవి, రామినేని రాజేంద్రప్రసాద్, పెండెం సాగర్, మంద దేవరాజ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు రంగారావుకు నివాళి

సుల్తానాబాద్, జనవరి 21: (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన స్వాతంత్ర సమరయోధులు ఎరవెల్లి రంగారావు చిత్రపటానికి ఎమ్మెల్సీ భానుప్రసాదరావు నివాళులర్పించారు. సుద్దాల గ్రామానికి చెందిన రంగారావు రజకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. రాజగోపాల్ రావు, అర్జున్ రావు, ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాలి

ఎలిగేడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి పథకాలపై దృష్టిపెట్టాలని డీపీఎం నాగేశ్వర్‌రావు, డీపీఎం రజనీలు అన్నారు. స్వశక్తి సంఘ మహిళలు నిర్వహిస్తున్న పిండిగిర్నీ, విస్తరాకుల మిషన్, కిరాణం దుకాణాలను సందర్శించారు. లబ్ధిదారుల వివరాలను బ్యాంకు మేనేజర్‌ను తెలుసుకున్నారు. ఐకేపీ ఏపీఎం సుధాకర్, సీసీలు జ్యోతి, ఆనంద్, మల్లేష్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

అంతర్గాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంగళవారం సీపీఎం జిల్లా నాయకులు బిక్షపతి, రామాచారిలు మజీద్ టర్నింగ్ వద్ద ఆవిష్కరించారు. సీపీఎం జాతీయ నాయకులు బృందాకారత్, బీవీ రాఘవులు పాల్గొనే సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీబీ వ్యాధి నిర్మూలనపై అవగాహన

పెద్దపల్లి రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తుర్కలమద్దికుంట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు రాగినేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి పట్ల టీబీ యూనిట్ సీనియర్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతి మంగళవారం అవగాహన కల్పించారు. తిరుపతి మాట్లాడుతూ దగ్గు, ఆకలి లేకపోవడం, రాత్రి సమయంలో జ్వరం, బరువు తగ్గడం, తదితర లక్షణాలు ఉంటాయన్నారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. అంటువ్యాధి కావడం వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉందన్నారు. ఎంఎల్‌హెచ్‌పి సుస్మిత, ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 24న జరిగే ప్రగతిశీల మహిళా సంఘం ఐక్యత మహాసభను విజయవంతం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు బీ బుచ్చమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పీఓడబ్ల్యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మంచిర్యాలలో మహిళా ప్రదర్శన ఉంటుందని చెప్పారు. పీఓడబ్ల్యూ నాయకురాళ్లు మంగ, పద్మ, శారద, సమ్మక్క, రాధక్క పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు

మంథనిరూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి డీ. మాధవి అన్నారు. ఎక్లాస్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంథని శ్రీసీతారామ సేవా సదన్ వ్యవస్థాపకులు గట్టు నారాయణ గురూజీ సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.2 లక్షలతో ల్యాబ్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంఈవో లక్ష్మి, సదన్ ఉపాధ్యక్షుడు కే. శ్రీనివాస్, కార్యదర్శి దుద్దిళ్ళ గణపతి, హెచ్‌ఎం జ్యోతి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సురేష్, బోనాల రవీందర్, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్జీ-2లో క్వార్టర్ల కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 కాలనీలోని క్వార్టర్‌లను ఉద్యోగులకు కేటాయించే నిమిత్తం మంగళవారం ఆర్జీ-2 యాజమాన్యం కౌన్సెలింగ్ నిర్వహించింది. ఓసీపీ-2, ఆర్జీ-3 జీఎం ఆఫీస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో క్వార్టర్ లేని వారికి చేంజ్ ఆఫ్ క్వార్టర్‌లకు సీఈఆర్ క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 969 క్వార్టర్లకు 136 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 56 మంది హాజరయ్యారు. అర్హులైన 44 మందికి అధికారులు క్వార్టర్‌లను కేటాయించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు త్వరగా పూర్తి చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్మిక కుటుంబాలకు అందుబాటులో ఉండేలా పోతనకాలనీ కమ్యూనిటీహాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం టీబీజీకేఎస్ నాయకులు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ప్రతిపాదనల మేరకు యాజమాన్యం గతంలో కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. వచ్చే నెల నుంచి శుభకార్యాలు ఉన్నందున కమ్యూనిటీహాల్ చివరి దశ పనులను వేగవంతం చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అదనంగా ఆరు గెస్ట్ రూంలు, టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. అయిలి శ్రీనివాస్ వెంట నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, నరేష్ ఉన్నారు.

ఓసీపీ-2లో పర్యటించిన డైరెక్టర్

రామగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2ను మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు పర్యటించారు. ప్రాజెక్టు వ్యూపాయింట్ ద్వారా క్వారీలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్య సాధనలో యంత్రాల వినియోగం, ఇతర ప్రణాళికలు, భద్రత అంశాలపై చర్చించారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, అధికారులు రఘుపతి, వెంకటరమణ, చంద్రశేఖర్, రామారావు, ఐలయ్య, కోల శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓసిపి-2 ప్రాజెక్టు డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ నిర్వహణపై ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య మంగళవారం డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు విభాగాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. అబ్దుల్‌కలాం స్టేడియంలో నిర్వహించనున్న వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గనులు, జీఎం ఆఫీస్ అలంకరణ, స్టాల్స్ ఏర్పాట్లపై చర్చించారు. డివిజన్‌లోని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీఎం పేర్కొన్నారు. సమావేశంలో వీకేపీ ఏజెంట్ నెహ్రూ, ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా సేఫ్టీ అధికారి సంతోష్‌కుమార్, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, అధికారులు ధనుంజయ, ఎర్రన్న, హుస్సేనీ, మురళీకృష్ణ, సృజన్‌మెహ్రా, డా. మహిపాల్, మాధవరావు, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్‌తో పాటు అన్ని గనులు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జీఎం

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో నిర్వహించే గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జీఎం కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో పలు అంశాలపై చర్చించారు. రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ, విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని సూచించారు. రఘుపతి, శేఖర్ బాబు, శ్రీనివాసులు, రాజశేఖర్, సిహెచ్. వెంకటరమణ, చంద్రశేఖర్, రామ్మోహన్, సుదర్శనం, రాజారెడ్డి, పాల్గొన్నారు.